పెద్దమనిషి

'మంజీర'

పక్షులు వాటియిష్టం వచ్చినట్టు అల్లరిచేశాయి ఇంకా చీకటి ఉండగానే. మనుషులలాగే వాటికూడా తెల్లవారుతోందంటే ఎందుకో అంత భయమూ దిగులూనూ. తెలవారితే తిండికోసం కష్టపడాలన్న ఆందోళనేమో వాటికూడా. ఏమయితేనేం వాటి నిత్యకృత్యం ముగించి మళ్ళీ సంజకెంజాయ రకముందే మెల్ల మెల్లగా నాలుగువైపులా తమ దారి చూచుకుంటూ ఎగిరిపోయాయి.

చలి ద్విగుణీకృత మయింది. ఎంతబలవంతుడినైనా గడగడ వణికించగల పటిమ చూపుతోంది. మంచుకూడా దట్టంగా పడుతూంది. పట్టుమని పదడుగులలో ఉన్న రూపంకూడా కనపడ్డం లేదు. సూర్యుడు చాలా నీరసంగా ఆ మంచులోనుండి తొంగిచూస్తున్నాడు. వీధులంట మనుష్యసంచారం హెచ్చింది.

అప్పటికప్పుడే వెంకమ్మ రోజు వారీ పనులన్నీ పూర్తిచేసుకుని అన్నంకూడా వండేసుకుంది. "నే వచ్చే వరకూ ఉండరా! అబ్బాయీ" అంటూ బుర్రకప్పుకుని అడుగుల్లో అడుగులు వేసుకుంటూ బయలుదేరింది.

ముసలితనం తన్నువెన్నాడుతోందన్న భయంతో విలవిలబోతూ వెనుతిరిగి చూస్తున్నాయి ఆమె శిరోజాలు. అస్పష్టంగా ముడతలుపడ్డ ముఖంలోనుండి మిలమిల మెరుస్తున్నాయి ఆమెకళ్ళు. కష్టం ఆమె అవయవాలే ఆవాసం చేసుకుంది. దరిద్రం ఆమెను చుట్టుముట్టేసింది అంధకారంలా. ఆమె తనజీవితాన్ని బాధలకే అంకితం చేసింది.

నడుస్తూండగానే చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చినట్లు హఠాత్తుగా ఆగి ఆ ప్రక్కనే ఉన్న పూరిగుడిసెదగ్గిరికి వెళ్ళింది. చింకితలుపు లోన వేసిఉన్నట్లుంది. కన్నంలోనుంచి తొంగిచూసింది. కాస్త ఎడంగా వచ్చి నిల్చుని "నాగులూ, నాగులూ!" అని గట్టిగా పిలిచింది వెంకమ్మ.

'ఆ! వస్తున్నా పిన్నమ్మా' అంటూ వినిపించిందో తియ్యని కంఠం.

ఆస్వరం అవ్యక్త మధురాలాపనలాగుంది.

రెండుమూడు నిమిషాలకు లోపలనుండి ఊడిపడింది ఓ పధ్నాలుగు, పదిహేనేండ్ల పడుచుపిల్ల. సంస్కారంలేనిజుత్తు. మాసిమరకలుపడి చిరిగిన బట్టలు. విసుగు, వేదనఉట్టిపడే మోము. శరీరావయవాలు చిక్కినా ఏమంత ఆకర్షణీయంగా లేకపోయినా, అన్నీ తిన్నబడితే అందానికేం లోటులేదనిపిస్తుంది. ఆమెలో ఏమూలనుంచో అందం, జిగేలుమని మెరుస్తూంటుంది చీకట్లో మిణుగురులా. ఆమె ముఖం కాస్త కోల. బాగా పాలిపోయిఉంది. చిన్ననోరు, పెద్దకళ్ళు, తిన్నని ముక్కు అందమేమో! లేకపద్నాటి ఆమోటు శరీరంపు సౌందర్యమో! ఆమె రాగానే వెలుగు వచ్చినట్లయింది. ఆమెమాటల్లో అపభ్రంశాలు మిగిలిన విశేషాలన్నీ తోసిరాజంటున్నాయి.

"యేమే యెంతసేపయింకేటి నేచి" అంది వెంకమ్మ ఆమెముఖంలోనికి చూస్తూ.

"నేగు పిన్నమ్మా. కొంత ఆలిస్సం అయినాది. యేం? యేవన్నా కూలిపనుందా ఏటి."

"యేకూలిపనింక? ఆకోతలు కాత్తా అయిపోయాయి మరి" అని మాట్లాడబోతూ ఊరుకుంది వెంకమ్మ నాగులువైపు దీక్షగా చూస్తూ. నిశ్శబ్దంలో ఓక్షణం గడిచాక "కుప్పనూర్పులు పతీవోడూ, అళ్ళకున్న నలుగురుపాలోళ్ళతోటి పరిజూచుకుంటున్నారు. మరింక కూలే" అందిరెట్టించిన నిరాశతో.

"ఔను" అంది నాగులు దించిన తల ఎత్తకుండానే.

"మరింకంటే మామూల్లా యీయేళ రావా యేం?"

"మాఅమ్మకు వంట్లో బాగా నేదు. యెవాగ సెప్పరాడం? మరి రాకపోతే గడవదు."

పెద్దమనిషి

"మరేం బయం నేదులే మీఅమ్మకు. కొంతన్నం వండి పడేసి యేగంగా రా మాయింటికి. యీరమ్మ, రాములు, లచ్చిమి, అప్పాయమ్మ యీ గుంటలంతా వత్తారు రోజూనాగే" అంటూ వెనుదిరిగి చూడకుండా వెంకమ్మ వెళ్ళిపోయింది.

నిజానికి నాగులుకి యేంచెయ్యడానికి తోచడం లేదు. ఏదోవిధంగా కష్టపడకపోతే, రోజు గడవడం యెంతకష్టమో నాగులుకి బాగా తెలుసు. ఆమెకు జ్ఞానం రాకపూర్వమే, ఆమె తండ్రి యీ ప్రపంచం వదలిపెట్టాడట. అప్పటినించీ యీతల్లే తన్నింత జేసింది. ఈవిషయం తనకు తెలిసినప్పటినుండి ఆమెకు తనతల్లి అంటే యేదో అర్థంతెలీని అభిమానం ప్రేమ. ప్రస్తుతపరిస్థితుల్లో తనూ, తల్లీకూడా కష్టపడినా రోజు గడవడం దుర్ఘటంగా ఉంది.

పని చేయించుకునేవాడల్లా ఎక్కువ ప్రతిఫలం యిస్తున్నానని గోలేగాని ఇచ్చేదాంతో బజారులో యేమొస్తోందో ఎవడికీ అక్కర్లేదు.

ఏది యెలాగున్నా నాగులు యింట్లో పనిచేయని రోజుపస్తే. తల్లి శరీరాస్వస్థతతో నాగులుతలబరువెక్కింది. వెంకమ్మ వాళ్ళతో వెళ్లడమా లేదా? అన్న ప్రశ్న ఆమెకింకా తలబరువెక్కించింది. ఏమయినా ఆమె తల్లి చెప్పినట్లు "పేదవాడికి పాట్లుముందు". వెళ్లక తప్పదు.

ఈమధ్య కూలికెళ్లడం అంటే కష్టమనిపిస్తోంది నాగులికి. శరీరం వంచి కష్టపడి పనిచేయడానికి భయపడి కాదు. తోటి కూలీల ప్రవర్తనచూసి. పనిజేస్తూంటే అస్తమానం తనప్రక్కనే నిలబడుతూ, కళ్ళతో తన శరీరాన్నంతా తడిమిచూసే ముసలిమేస్త్రీనిచూస్తే కంఠం కోసుకుదామా అనిపించేదామెకు. పెళ్లాం ఎదురుగానే తన్ని మాటలతో బాధించి ఆనందించేవాడు మరో కూలివాడు; గంప తలకెత్తుతూ పొరపాటున తాకినట్లు మోచేత్తో తనరొమ్ము తాకేవాడు, గున్నపోతులాంటి మరో కుర్రవెధవ. వీళ్ళందరినీ యేంచెయ్యాలో తెలీక కూలిపోయేది. పని చేయకపోతే నిలువునా మాడి చచ్చిపోవలసి వస్తుంది.

తల్లికి చెపితే "అవన్నీ బీదవాళ్ళు తప్పించుకోలేని సాంఘిక కౌర్యాలు, కత్తివాయిమీద నడిచినట్లు, యీ జీవితం గడపాలి. ఈ యాతిబాధలన్నీ, అతి నేర్పుతోను ఓర్పుతోను ఎదుర్కోవాలి. పరిస్థితుల్ని మనోదార్ఢ్యాన్ని బట్టి నడుచుకోవాలి. అంతేగానీ, ప్రస్తుత సామాజిక వాతావరణంలో యీ అవినీతి నడవడికను, అసహ్యప్రవర్తనలను ముక్కుకు సూటిగా ఎదుర్కోడం కష్టం మాటకేమి గాని అసంభవం" అన్న ధోరణిలో ఎంతో చక్కగా చెప్పిందామెకు. ఆమెచెప్పిన విషయాలు చాలా లోతయినవి. జీవితం స్వయంగా చిలికి చేకూర్చుకున్నవి.

నాగులు మనస్సులో తల్లి బోధనలు స్థిరస్థావరాలేర్పరచుకున్నాయి. బీదతనం గూర్చి, ప్రపంచంలో నిరాఘాటంగా కొనసాగే చట్టబద్ధమయిన అవినీతుల గూర్చి తన తల్లికి తెలిసినంత యితరులకెవ్వరికీ తెలీదన్న గాఢ విశ్వాసం ఆమె మనస్సులో పాతుకుపోయింది. తల్లి చెప్పిన మాటలు అమాయకంగా విశ్వసిస్తుంది. అదో అలవాటయింది కూడా.

వెంకమ్మ వెళ్లాక లోనికిపోయి ఈ విషయం అంతా తల్లితో చెప్పింది. నిజానికి తనకు, ఆమె నాస్థితిలో విడచి వెళ్ళాలని లేదంది. కాని ఆపాటి దానికే నాగులు తల్లి ఒప్పుకుంటుందా? ఆరోజు కూలికి పోకపోతే మరునాడు పస్తు తప్పదని తెలీకపోడం లేనేలేదు. అనేకవిధాల చెప్పి కూలికి వెళ్ళమని ఒప్పించింది నాగులును.

రోజులుచూస్తే కడు నికృష్టంగా ఉన్నాయి. డబ్బున్నా తవ్వెడుబియ్యం. దొరకడం చాలా దుర్లభంగా ఉంది. ఎక్కడికక్కడే బియ్యంకొరత వినవస్తూంది. దినదినం ప్రజలలో బియ్యాన్నిగూర్చి ఆందోళన ప్రబలుతూంది. ఇదే అదనని అనేకులు అనేకవిధాలుగా బ్రతుకుతున్నారు. డబ్బున్నవాళ్ళు మరీ ధనవంతులవుతున్నారు. ఈ పరిస్థితి అనేకుల అమాయకుల ప్రాణాలు బలిపుచ్చుకుంది.

ఊళ్ళో కూలి లేకపోవడంవల్ల నాగులు, వెంకమ్మ మొదలుగాగల వాళ్ళు ఈ పరిస్థితి ఊతగా తీసుకుని బ్రతుకుతున్నారు. ప్రక్కబస్తీలో దొరుకుతున్న బియ్యం కొని యింకోవూరికి పోలీసుల కంట బడకుండా పట్టుకుపోయి అమ్ముకుంటున్నారు.

అనుకున్న ప్రకారం నాగులు వెంకమ్మ యింటి వద్ద, అందరినీ కలుసుకుంది. ప్రక్క బస్తీకి వెడదామనుకుంటే వెడదామనుకున్నారు. ఏవో ఏవో మాటలు చెప్పుకుంటూ, కిలకిల నవ్వుకుంటూ, దారంట మరేం

జరుగుతోందో తమకేమీ తెలియనట్లు కేరింతాలు కొడుతూ పోతున్నారు. దార్లో నడుస్తున్న బాటసారులు తమనే హేళన చేసినట్టు మనస్సు చివుక్కుమంటూంటే తీక్ష్ణంగా, కోపంగా వీళ్ళవైపు చూసుకుంటూ పోతున్నారు. మధ్యమధ్య కాస్త వరాల నిస్త్రాణ ఉన్న పెదమనుషులు బాహాటంగానే నోరు విడిచి "పోకిరీ వేషాలు! బుద్ధిలేని పాటకపు పీనుగులు!" అని తిట్టుకుంటూ వెళ్ళారు.

ఎవ్వరేమన్నా అనుకున్నా, వినిపించుకోకుండా, లెక్కలేకుండా, నిర్వికారంగా, వాళ్ళు తమ పూర్వానుభూతులు చెప్పుకుంటూ, ఆనంద ఘట్టాలు వినవచ్చినపుడు సంతోషిస్తూ, కొత్త నవ్వు పుట్టించే విషయాలు వినవచ్చినపుడు కొంచెం గట్టిగా నవ్వుకుంటూ, విషాదపరిస్థితులు రూపించినపుడు, విచారంతో మౌనంగా పోతూఉన్నారు.

అలా రైలువచ్చే వేళకు సరిగా రైల్వేస్టేషను చేరుకున్నారు. వెంకమ్మ టిక్కెట్లుకొనే కిటికీదగ్గరకు వెళ్ళగానే టిక్కెట్లిచ్చే గుమస్తా కనుబొమలెగరేస్తూ "ఏంముసలమ్మా, యేమిటి సంగతి" అన్నాడు మందహాసపూర్వకమయిన ముఖంపెట్టి. వెంకమ్మ ముసలిది మాత్రం కాదు. కాని యౌవనంపొంగే ఆ యువతుల మధ్యఉంటే వెంకమ్మ పడుచుదని ఎవరంటారు.

అయినా వయసులోఉన్న ఆడదాన్ని చూసేసరికి, మూగవాడికికూడా మాటలు పుట్టుకొస్తాయి. ఆతె వాళ్ళ విలువ ఉపయోగం అంతమాత్రమే నేమో!

వెంకమ్మకు ఎవరికెలా జవాబియ్యాలో బాగా తెలుసును. "నీకు తెలియని దేముందినాయనా!" అంది పాలిపోయిన పెదవులనుండి పేలవమయిననవ్వు జారవిడుస్తూ. ఇతరమయిన ప్రశ్నలేమీ వేయకుండా, ఆ గుమస్తా వెంకమ్మకు కావలసినటిక్కెట్లు ఇచ్చేశాడు. వెంకమ్మ అతని బాగోగులు ప్రశ్నించి, వెళ్ళవస్తానంటూ చెప్పి చల్లగా వచ్చేసింది. వాడుకూడా అదేదో గొప్ప ఆనందదాయకమయినట్లు ఆనందించేసి, ఆమె వెళ్ళాక తన చిరునవ్వు నెమరువేసుకుంటూ కూర్చున్నాడు.

ఇలాంటి లౌకిక ప్రవర్తనవల్ల వెంకమ్మ చాలామంది పరాశ్రయ జీవులకు ముట్టజెప్పవలసిన నాలుగు పైసాలు మిగిలించుకునేది. ఎవరివద్ద ఏవిధంగా మాట్లాడాలో ఆమెకు మంచినీళ్ళప్రాయం. అప్రయత్నంగా ఏడవడం, అప్పటికప్పుడే నవ్వడం, పదిరోజులనుండి తిండిలేనట్లు ముఖంపెట్టడం, మృదువుగా నవ్వుపుట్టేటట్లు, దీనంగా సానుభూతికలిగేట్లు మాట్లాడ్డం ఆమెకు కరతలామలకం. ఈలాంటి జీవితంతోనే ఆమె చాలా భాగం జీవితాన్ని గడిపింది. తనతో వచ్చిన జట్టులో ఎవళ్ళకు యే చిక్కువచ్చినా తన శక్తియుక్తులచేత ఎలాగోఒకలాగ తప్పిస్తూ, దినదినగండం వెయ్యేళ్లాయుష్షులాగ జరిగిస్తోందా వ్యాపారం. ఆమె జట్టులో ఆమెమాటకెవరూ కాదనరు. ఒకవేళ వాళ్ళకు రావలసినడబ్బంతా, నిజంగా వెంకమ్మ ఎగేసినా ఆ బ్రహ్మదిగివచ్చి నచ్చజెప్పినా, వాళ్లు వెంకమ్మకెదురుతిరగరు. ఎందుచేతనంటే, వెంకమ్మ తమకెన్నడు ద్రోహం చేయదనీ, చెయ్యలేదనీ, వాళ్ళహృదయాంతరాళనాళాల్లో జీర్ణించిపోయింది. ఆ నమ్మకాన్ని స్థానాన్నీ సంపాదించింది వెంకమ్మవాళ్ళమధ్య.

రైల్వే స్టేషనుమాస్టరు ఏభయ్యోపడిలో పడ్డాడు. నిర్మలత్వాన్ని, నిశ్చలతను సూచించే గంభీరమయిన ఆ కళ్ళు, ముడతలుపడి మాటాడితే ఊగిసలాడే అతని ముఖము, అసలు కలతజెందని మనస్తత్వము. ఆ తెల్లటి 'యూనిఫారము' పరిశీలిస్తే మామూలు వాళ్ళకు అదో రకమైన భయంతో కూడిన గౌరవం కలుగుతుంది.

వెంకమ్మ స్టేషనుమాస్టరును బాగా ఎరుగును. స్టేషనుమాస్టరుబాబుకి వెంకమ్మ తన శక్త్యనుసారం చిన్న చిన్న లాభసాటి పనులు చేస్తూంటుంది. ఆమె మాటల మంచితనంవల్లనయితే నేమి, ఆమెవల్ల తనకు జరిగే క్షుద్రలాభాలవల్లనయితే నేమి రెండు మూడు సార్లు ముసలిమాష్టరు వెంకమ్మను నిజమయిన అపాయాలనుంచి రక్షించాడు. వెంకమ్మ అతణ్ణి దేవుడంటుంది.

ఆరోజు మాష్టరుబాబు వెంకమ్మను వీక్షించి దరహాసవదనంతో "ఏం? వెంకమ్మా యేమన్నా ఉందేఁటి?" అన్నాడు.

"యేటిబాబూ, తెలిసున్నోరు మీరుకూడానా సెప్పండి. మీరేదో పెద దొంగ సావుకార్లని పట్టాలి కాని" అంది నవ్వుతూనే.

"బాగా చెప్పావులే."

"అది కాదు బాబూ. మేమిప్పుడు ఈ యాపారం సేత్తున్నామంటే యేం నాభాలు దొరికేసుత్తాయి. యిదే

వస్తా యాపారంయేటిలెండి. మనూర్నందర్నీ దొంగల్లా సూత్తారు. ఏదో ఆ వారానికి సరిపడ దొరికితే అదే గొప్ప. తను రెరగని దేముందిలెండి. యెంత మంది డాబుసేత్తారో నామీద ఒకడా, ఇద్దరా. దారి కడాకు దీపాలే బాబు"

"ఆ దీపాలన్నిటికీ చమురు పొయ్యాలా యేం" అన్నాడు నూపగుబాబు నవ్వుతూ, తనుకూడా ఆ దీపాలలో ఒక దీపమన్న మాట మరచి.

"బాగా సొప్పావుబాబు. మా నాయన, సల్లగా సౌఖ్యంగ ఉండు పదికాలాలపాటు."

"వస్తా, వెంకమ్మా" అంటూ మెల్లగా తనగదివైపు మరలి కొంతదూరం నడిచి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు వెనుదిరిగి "వెంకమ్మా" అని పిలిచాడు. వెంకమ్మ ఆయన దగ్గరకు పరుగు పరుగున వచ్చింది.

"చూడు! ఇంట్లో కూరగాయలు లేక మా చెడ్డ బాధ పడుతున్నాం ఎలాగయినా" అంటూ మాట తుంచి డబ్బులు తీస్తున్నట్లు జేబులో చేతులుంచి గుల్లు మిటకరిస్తున్నాడు.

వెంకమ్మ కూడా అతని తాపత్రయం అంతా గమనించనట్లు నటిస్తూ—"ఈపాటి భాగ్యానికి డబ్బులివ్వాలా బాబూ. నే తిరిగొచ్చేటప్పుడు తీసుకొని వస్తా" అని చెప్పింది.

"మంచిది అంటూ ముసలాయన తన గదిలోకి వెళ్ళాడు.

అప్పటికప్పుడే రైలుబండి యింటిసున్ముంలోకి వచ్చేసింది. స్టేషనులో గణగణ గంటకొట్టారు, ప్రయాణీకులను తమతమ సామానులు సర్దుకుని రైలు ఎక్కడానికి సిద్ధంగా ఉండండని హెచ్చరించేటట్లు. పెట్టెల్లో జనం కిటకిటలాడుతున్నారు. ప్రయాణీకులు ఒక దొమ్మిలో మునిగిపోయినట్లు గుమిగూడారు ఆ పెట్టెవద్ద. వెంకమ్మ ఆమెజట్టు తమ ప్రాణాలు అరచేతుల్లో ఉంచుకుని యెక్కగలిగారు ఆ పెట్టెలోకి.

ఆ రెండు నిముషాల్లోను ఆ ప్లాటుఫారంమీద ఎంత దారుణమయిన అరాచకం రేగిందో ఆ రైలు పోగానే అది అంత నిర్మానుష్యం అయింది.

రైలు కదిలేవరకు రైలుపెట్టెలో మనుషులు ఉడికిపోయారు యెండవేడికి గాలిలేక. రైలునడవడంవల్ల గాలి బాగాసోకుతోంది. లోపలనున్నవాళ్ళ శరీరాలు చలబడ్డాయి. నిలుచున్నవాళ్ళు కూర్చున్నవాళ్ళమీద కారాలు మిరియాలు నూరుతున్నారు. వెంకమ్మకు ఆమె జట్టుకు యిది మామూలు ప్రయాణం అవడంవల యీ తగవులాటలనుండి తప్పుకుని ఓ మూల నేలమీద చతికిల పడ్డారు. లోకాభిరామాయణం విప్పారు. కూర్చున్న వాళ్ళు మనకేం అన్నట్లుగా ఒకళ్లిద్దరు కూర్చునే జాగాల్లో కాళ్లుచాచుకుని కూర్చున్నారు.

ప్రౌఢాంగన ఒకరు వేరుశెనగకాయలతుక్కు పొయ్యడానికి రైలుపెట్టెలో ప్రత్యేకస్థలా లేర్పాటు చేయలేదనే కోపంతో కాబోలు వేరుశెనగకాయల తుక్కుతో ఆ పెట్టె నింపుతోంది ఆమె ప్రక్కగా కూర్చున్న నాటుఆసామీ ఒక పొడుగాటిచుట్ట వెలిగించి అటంబాంబుపొగమబ్బులు వదులుతున్నాడు. ఇవంతా చూస్తూ సహించి ఊరుకున్నారు ప్రయాణీకులు.

చంటిపిల్లనెత్తుకున్న ఓ రోగిష్ఠితల్లి కూర్చున్న వాళ్ళందరినీ అసూయతో కలయజూస్తోంది. నుంచోలేక పోతూంది. ఆమెవైపు కన్నువాల్చకుండా చూస్తున్న వెంకమ్మ ఆమెను కూర్చోమంది తను లేచి. ఆమె యిటూ అటూ చూసి, తన నీరసానికి, నిస్సహాయతకు మనస్సులోనే తిట్టుకుంటూ అయిష్టంగా సాగిలబడిందా నేలమీద.

ఇవంతా నాకెందుకులే అన్నట్లు రైలుబండి అమితవేగంతో కదలిపోతూంది పొగ వెళ్ళగక్కుతూ.

ఆమె ఒడిలో పిల్లాడు దారుణంగా యేడ్వడం మొదలెట్టాడు. ఆమె ఎంత ఊరడించినా ఊరకోవడం లేదు. ఊరుకోబెట్టినకొద్దీ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"అమ్మాయీ! యీపాటి తెలీలేదా! కట్టాడు చెమటు కక్కుతూంటేను. ఉక్కపోసి యేడుస్తున్నాడు యిలాయియ్యి" అని వెంకమ్మ ఆ పిల్లాడిని తీసుకుని పైకియెత్తి అక్కడున్న వాళ్ళని ఒత్తిగించి కిటికీదగ్గర నిలబెట్టింది. పిల్లాడు రోదన మానిబోసినోటితో నవ్వుతూ చేతులు కాళ్ళూ ఊపుతూ నాట్యం చేస్తున్నాడు. అంతయేడుపు మాయమయింది ఆర్పిన ఎలక్ట్రిక్ బల్బులో కాంతిలాగ. రైలుబండి మళ్లీ ఆగింది. వెంకమ్మ పిల్లవాడిని తల్లికిచ్చింది.

తమతమ సంచీలు మూటలు తీసుకుని వెంకమ్మ, ఆమెజట్టు దిగిపోయారు గుడ్డితప్పి కన్ను లొట్టపోయిం

దినుకుంటూ. స్టేషన్‌లోని వాళ్ళు తన్ను పలకరించుతూంటే యెవరికి తగినసమాధానం వారికిస్తూ, ఆపిల్లల గుంపును వెంటబెట్టుకుని వెంకమ్మ బజారుకి చల్లగా జారుకుంది.

దారంట నడుస్తున్నారంతా త్వరిత గమనంతో తెలువంచుకుని. మొట్టమొదట యింటివద్దనుండి బయలుదేరినప్పుడున్న చలాకీ కబుర్లు నవ్వులూ పూర్తిగా విస్మరించారు కాని, ఆనడకలో యింకా ఆ అహంకారము స్వతంత్రత పూర్తిగా మూర్తీభవించి ఉన్నాయి. వాళ్ళు బజారుకుపోయి కొనవలసిన బియ్యం అన్నీకొని, పరుల కంటబడకుండా ఉండడానికని అనేక చిన్న పెద్ద మూటలుకట్టి మళ్ళీ రైల్వే స్టేషనుకు బయలుదేరారు.

వెంకమ్మ మిగతా వాళ్ళందరకు నడుచుకోవలసిన రీతి బోధిస్తూంది. ఎవరితోనూ యేవిషమయిన మాట పట్టింపు పెట్టుకోకూడదనీ, తమపని చక్కబెట్టుకునే వరకూ వినయంగాను, ప్రార్థనాపూర్వకంగాను మాట్లాడమనీ సూచించింది.

మిగతా వాళ్లు అంతా వెంకమ్మంత అనుభవశాలులు కాకపోయినా యీ విషయాల్లో కొంచెం విజ్ఞానవతులే అని చెప్పుకోవాలి. నాగులుకి మాత్రం యీ ప్రాధేయ పడడంలోను, ప్రార్థనలలోనూ నమ్మకం లేదు. వాటివల్ల మనుషులు యెంత కుమిలిపోవాలో, నవ్వులాట పాలవాలో చాలాచాలా సార్లామె అనుభవించిన విషయం.

ఇలాంటి చట్ట వ్యతిరేక వ్యాపారాల్లో ముఖ్యంగా దీనాలాపాల ప్రభావం అతి స్వల్పం. చిల్లిగవ్వపనికూడా జరగదు. "తామీ విధంగా పొట్టపోసుకోవలెనని చూస్తే, ఓ ఉద్యోగి కాస్త మంచి మంచి దుస్తులు తొడుక్కొని దర్జాగా కాలం గడపాలని చూస్తాడు. మరో దొంగవ్యాపారి అంతస్థుపై అంతస్థు మేడలు కట్టించాలని చూస్తాడు. దీనిలో జాలీ దయా యెక్కడిది?" అనుకుంటుంది నాగులు.

అయినా వెంకమ్మలో ప్రత్యేకత ఉంది. ఆమె టక్కరి బొల్లి బొల్లి యేష్పాలతో చాలా గొప్పపనులు తమ కన్నుల యెదురుగానే చెయ్యగల్గింది. అందరూ వెంకమ్మలా ఎలా చేయగలరు! అందుకే తమకు సాధ్యంగాకపోయినా ఆమె మాటలు అందరూ మౌనంగా వింటారు.

వాళ్ళు దార్లో చౌకీకి దూరంగా దూరంగా నడుస్తూ, అనుమానంతో అప్పుడప్పుడా చౌకీదారు వైపు చూస్తూ నడుస్తున్నారు. వీళ్ళు చల్లగా జారుతూంటే ఆ చౌకీదారు చేత్తో సంజ్ఞ చేశాడు. వెంకమ్మకూడా సంజ్ఞా పూర్వకంగానే సమాధానం ఇచ్చింది. వాడు మీసాలు మెలెడుతూ అటువైపు చూస్తూ నిలబడ్డాడు.

అతడి బుజంమీద బరువుగా పడిందో దెబ్బ. అతడు ఉలిక్కిపడి అటు చూచాడు. కాస్త జంకాడు.

"ఆ! యేమిటా సంజ్ఞలు! ఆ ముసలిదాన్నెరుగుదువా?"

"అబ్బే ఏం లేదండి."

దాంతో యేదో సంజ్ఞలు నడుపుతున్నావు. మాంచి నక్కల్లాంటి కుంటల్నెంటేసుకు తిరుగుతోంది. యేటి సంగతి."

"యేటో చిన్న చిన్న యాపారాలు సేత్తున్నారండి."

"యేటా యాపారాలు. యేదన్నాపిల్ల యేన కాలబడ్డావేంటి."

"అబ్బే నేదండి. అలాంటి గొడవ ఏం నేదు."

"మరి నువ్వు సెయ్యాల్పుతున్నావు, అదీ చెయ్యాల్పుతూంది!"

"ఆ ముసలిదాన్నెరుగుదునులెండి."

"అదిగో దానెనకనే యెడుతూంది, కొత్త నాజూగ్గా పొడుగ్గా ఉంది. దాన్ని సూత్తే మనసు చెగువైపోతూంది. ముసల్దానేమన్నా కదపగలవా?" అన్నాడా వ్యక్తి. చౌకీదారు నిశ్శబ్దంగా ఉన్నాడు. కాస్త దూరాన్నుండి వెంకమ్మజట్టు దొంగ చూపులు చూస్తూ కదలిపోతున్నారు.

"ఏం మాట్లాడవేం" ఆ ముసలిదాన్నెలా యెరుగుదువు.?"

"బియ్యం యాపారం సేత్తోందండి" అన్నాడు అప్రయత్నంగా చౌకీదారు. తరువాత తన తెలివి తక్కువకు నాలిక కొరుక్కున్నాడు.

"ఆ! అదా సంగతి. ఆళ్ళెదో ముటసెపుతోంటారంతేకదూ! ఆహా" అంటూ తలూపాడు. చౌకీదారు తలొంచుకునే నిలబడ్డాడు.

పెద్దమనిషి

"అయితే యీ యాశేం దొరకదాయేం" అన్నాడు కొత్త వ్యక్తి.

"వాళ్ళ యాదం వాళ్ళేమిస్తారండీ పాపం. పావలా బేడా లాభాని కమ్ముకుంటారు.

"పోనీ పగుగట్టికళ్ళి ఆ మాత్రమేనా పట్రా. వచ్చివాడి పెళ్ళికొచ్చిందే కట్నం. అదీ యివ్వలేక పోతే ఆగుంటనేనా లాక్కురా" అన్నాడు సిగ్గులేని అధికారంవెళ్ళ గ్రక్కుతూ. చౌకీదారు మాట్లాడకుండా పరుగులంకించుకున్నాడు. అయిదునిముషాల్లో వెంకమ్మను కలుసుకున్నాడు.

"ఏం నాయనా! అంత ఒగురుస్తూ పరుగెట్టుకు వచ్చావు. నీకేమున్నా ముట్టసెప్పకుండా ఉంటామా" అంది వెంకమ్మ చలాకీగా.

"అడుగో అక్కడింకోడున్నాడు చూశావా" అంటూ చౌకీదగ్గరనుంచున్న ఆ అస్పష్టవ్యక్తిని చూపించాడు. "ఆడు నా నెత్తి మీద దేవుడు" అన్నాడు.

"అయితే యేటంటాడు."

"పావలో పరకో తెమ్మంటాడు. అలా కాకపోతే, నీ యెనకాలే నడుత్తోంది చూడూ, ఆగుంటను యెనకాలే తీసుకు రమ్మంటున్నాడు." అన్నాడు ప్రశ్నార్థకంగా.

నాగులు భయపడిన కోడిపిల్లలా వెంకమ్మ వెనకాల దాగుంది.

"ఆడిజిమ్మడ! యెదవ!" అంది వెంకమ్మ ఉద్రేకంతో అకస్మాత్తుగా. అంత చటుక్కున తిట్టేనందుకు పశ్చాత్తాపపడింది. కళ్ళంట నీళ్లు తిప్పుతూ.

"నీకు తెవీని సంగతేముంది బాబూ. మేంకూడా నీలాంటోళ్ళమేనా సెప్పు. రెక్కాడితేగాని డొక్కాడదు. యీ కట్టమంతా పడితే ఓపావులా మిగుల్తుందో మిగలదో, దారిపొడుగునా పతీవోడూ ఓ పావలా గుంజుకుంటే మా బతుకు లేంగాను. ఆ గుంటేమన్నా నాపిల్ల గనకా నీ యెంట నంపడానికి. ఆడికేనా సిగ్గులేదంటావా అలా సెప్పడానికి?"

"మొనటనే నల్లరి పెట్టావానిన్ను. యేదో ఓ పావలా పారేసి మీ నూనాన మీరుపొండి. అది ఆడి మొగాన పారేత్తా." అన్నాడు చౌకీదారు సానుభూతి సూచకంగా. వెంకమ్మకూడా రొంటనున్న పావలా తీసి వాడిచేతిలో ఉంచింది. వాడది తీసుకొని—

"యిదిగో ముసలమ్మా! యింకముందు మీరీ బియ్యం మూటలెట్టుకుని యీదారినొస్తే జైల్లో పడిపోతారు. లేకపోతే ఆడు సెప్పినట్టు సేత్తోండవలసిందే. నా సేతుల్లో యేంలేదు. తర్వాత మీయిట్టం." అన్నాడు తీవ్రంగా.

"అయితే మా బతుకులు పోయినట్టే. యీ తాగ గంజికూడా తాక్కుండా వస్తుండాలి" అంది దీనంగా. వెంకమ్మ.

"అయితే ఆడుసెప్పినట్టు సేసుకోండి." అన్నాడు విసురుగా.

"అనా యెనాగ సేత్తాంబాబూ. మాకు మాత్రం గౌరవం నేదాయేటి."

"మీయిటం. నే నేం చెయ్యగల్ను. అయినా యిదివరకు లాగే అపాలాలదారిని పొండి, ఎవడూ అడ్డేవాడుండడు కొత్తిదూరమయితే నేం" అన్నాడు.

వాడు మాటాడకుండా ఆ పావలాఅతని చేతిలో పెట్టాడు. కోపంతో ఆ అధికారి నేలమీద విసిరికొట్టి "హోరి మొద్దూ! మన పరువుతీశావురా. పావలా యిస్తేపుచ్చుకున్నావూ?" అన్నాడు.

"అంతే ఇచ్చారండి నిజం చెప్తున్నాను."

"నాకే డుబికీ యిద్దామనిమాస్తున్నావూ? ఎవడి దగ్గరోయి యీ సానివేషాలు. వాళ్ళదగ్గర యెక్కువ డబ్బులాగేసి, పావలాఅన్నమాట నానోరుజారిందని ఆ పావలా నామొఖాన్న కొడుతున్నావా" అని గర్జించాడు.

'లేదండిసార్ ... లేదండి" అన్నాడతడు వణికే చేతులు నలుపుతూ.

"ఏంలేదు? నువ్వు పుచ్చుకున్నావు. ఎంతిచ్చారు నిజంచెప్పు?" అంటూ ఉరిమాడు.

అధికారం దుర్వినియోగం చేసేప్పుడు మానవునిలో మానవత్వం నశిస్తుంది.

"నిజంసార్ —నిజం. నాపిల్లలతోడుగా చెప్తున్నాను పావలా ఇచ్చారు. అంతేనండి" కళ్ళంట నీళ్ళ పర్యంతం తెచ్చుకుని అన్నాడు.

"ఒరేయి అబ్బాయ్, మనదగ్గర అబద్ధంఆడి బ్రతికి యెవడూ బయటపడలేదు. యిలాంటి టక్కులు వేషాలంటే నలిపి నేలరాసేస్తా తెలిసిందా. ఇప్పుడైనా వాళ్ళెంతయిచ్చారో మర్యాదగా పడెయ్యి. ఇద్దరం సమానంగా పంచుకుందాం. భయపడమాకు" అన్నాడు లాలనగా.

"వాళ్ళు పావలాయే యిచ్చారండి కావాలంటే నా బట్టలు తణిఖీ చేసుకోండి" అన్నాడు భయం ఉట్టి పడుతూ.

"అంతడబ్బివ్వలేనంటే ఆపిల్లనే తీసుకురాలేక పోయినావూ. చచ్చుదద్దమ్మా" అన్నాడు చురచుర చూస్తూ.

"ఆమాటకూడా చెప్పానండి. యీ వేళ కాలస్యం అయినాదంట, మళ్ళీ వచ్చినప్పుడు వస్తానంటూ ఆపిల్లే ఒప్పుకుందండి" అని అబద్ధం ఆడాడు అసలు సంగతి పసిగట్టి.

"అలా మొదటే యేడవరాదూ, ఆపావలా ఇలా యియ్యి' అంటూ క్రిందనున్న పావలా వాడిస్తే పుచ్చుకుని యీలవేసుకుంటూ వెళ్ళిపోయాడు.

2

వెంకమ్మవగయిరాలు స్టేషను చేరుకునేసరికి సరిగా బండీ స్టేషనులో ప్రవేశించింది. వెంకమ్మ ఆజ్ఞ ప్రకారం అంతా తలో పెట్టెలోనికి సర్దుకున్నారు. రైలు బయలుదేరగానే యితర రైల్వే ప్రయాణీకులను నానావిధాల బ్రతిమాలి, బియ్యంమూటలకు, బస్తాలకు రహస్యస్థానాలు చూచుకున్నారు. వాళ్ళుమూటలెంత రహస్యంగా దాచినా, మొగాలు చూచేసరికి బోధపడుతుంది ఆసంగతి. అందరి మూతులూ కట్టే వీళ్ళూ యీవ్యాపారం సాగిస్తున్నారు.

అథవా వీళ్ళెవరయినా దమాయించినా, వారి హోదా, తీని నాల్గురాళ్ళ చేతిలోపడేవరకే!

అన్నిటికన్నా ఆశ్చర్యకరమయిన విషయమేమిటంటే, వీళ్ళిలా ధారాళంగా మూటలన్నీ యెక్కిస్తున్నా అందరు చూసీచూడనట్లు ఊరకుంటారు. అధికారు అడిగినా వెంకమ్మ సముదాయించుకుంటుంది. రైలు రెండవస్టేషనులో చేరగానే, వెంకమ్మ అన్ని పెట్టెలు గబగబా తిరిగి అందరినీ ఓసారి చూచుకుంది. మరేం ఆదుర్దాలేకుండా జాగ్రత్తిగానే ఉన్నారు. తనూ తిరిగివెళ్ళి తనమూటలున్న పెట్టెలో కూర్చుంది.

వెంకమ్మ వెళ్ళగానే నాగులు పెట్టెలోకి, ఈ దొంగబియ్యం పట్టుకుందుకు నియోగించబడిన ప్రత్యేక ఉద్యోగస్థుల సిబ్బంది యెక్కారు. రైలు మళ్ళీ తన ప్రయాణం సాగించడం మొదలుపెట్టింది. వాళ్ళు పెట్టెఅంతా కలయచెతకడం మొదలుపెట్టారు. ఆఖరుకి నాగులు దాచినబియ్యం అన్నీ పట్టుకున్నారు. నాగులు ఓమూల నక్కి భయంతో వణికిపోయింది. మాటాడకుండా కూచుంది తనకు సంబంధం లేనట్టు. అయినా అందరు ప్రయాణీకులు ఊరుకోరుదూ. అందులో కొందరు అనూయాపరులు నాగులుసంగతి చాలా సంతోషంతో ఎరుకపరచారు. ఆమె భయంతో ముద్దయిపోయింది.

ఆ అధికారవర్గంలోని ఒకడు ఆమెదగ్గరకు రుసరుస చూస్తూవచ్చి "యీమూటలునీవేనా?" అన్నాడు.

ఆమె నోరుమూసుకు పోయింది. పెదవులు వణికాయి. కళ్ళంట రెండు నీటిబిందువులు రాలాయి. ఆ అధికారికి కోపం ఎక్కువయింది. ముఖం జేవురించింది. కోపంతో ముఖం వికారంగా విప్పి "యేం, మాటాడవేం వల్లసేనాపరాయిలాగ? యివి నీవేనా? చెప్పు." అన్నాడు.

"ఆ. నావే" అంది యింక బొంకి లాభంలేదని.

"ఆహా! అలాగా!" అన్నాడు హాస్యధోరణిలో.

ఆమె మాట్లాడలేదు.

"ఈ ప్రక్కస్టేషనులో దిగి పోలిసుఠాణాకి పద" అన్నాడు తీవ్రంగా.

ఇంతలో ఆఫీసరువచ్చి తన శాయశక్తులా తిట్టాడు.

అతనలా తిట్టవచ్చునని ఏ శాసనంలో ఉందో ఎవరికీ అర్థం అవలేదు. అలా తిట్టినప్పుడు ఆపవచ్చునని కూడా ఏ శాసనంలోను లేదని కాబోలు, ఆ రైలు పెట్టెలో ఎవరూ యేమీ పట్టించుకోలేదు.

నాగులు మాత్రం యేమి మాట్లాడాలో అర్థంగాక అలా శిలాప్రతిమలాగ నిశ్చేష్టంగా నిలబడిపోయింది. ఆ అధికారి అనుయాయులంతా ఆమె చుట్టూ మూగారు. ఆమె అతడి కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలింది. అతడు చలించలేదు.

విధి నిర్వర్తిస్తున్నాడు పాపం.

అందరూ తలో మాట అంటున్నారు. నాగులు కన్నీటితో వేడుకుంటోంది. అతడు దురుసుగా కసురుతూ, అసహ్యించుకుంటూ తిడుతూనే ఉన్నాడు.

అంతలో ఆ రైలుపెట్టెలో ఓమూలనుండి "ఏమండోయ్, యిలా దయచెయ్యండి" అని వినిపించింది. అందరూ ఒక్కసారి అటు చూశారు. ఆ అధికారీ చూశాడు.

మోటు ఖద్దరుబట్టలు కట్టి, తెల్ల టోపీ పెట్టి, మూలకూర్చున్న ఒక వృద్ధయువకుడు మళ్ళీ ఆ అధికారినుదేశించి "తమరినే యిలా దయచేయించండి" అన్నాడు.

ఆ అధికారి ఆవైపు తేరిపారజూచాడు. ఆ టోపీ చూడగానే అధికారం జ్ఞాపకమొచ్చింది. ఆ దుస్తులు చూడగానే రాజ్యతంత్రం కళ్ళలో తిరిగింది. అధికారి కంగారుపడ్డాడు. తన దురుసుతనానికి తనే నొచ్చుకున్నాడు. మంత్రముగ్ధుడిలాగ అతని పక్కకి వెళ్ళాడు.

"ఇలా రండి. ఇక్కడ కూర్చోండి" అని పక్కన ఖాళీజాగా చూపించాడు. అతడుకూడా మాటలాడకుండా అతని అనుమతిప్రకారం నడుచుకున్నాడు.

"చూడండి! పాపం! ఆ పిల్ల ఎంత బతిమాలుతూందో అంత ప్రాధేయపడుతూన్నపుడు మీరు కాస్త కనికరం చూపాలేమో."

"అయ్యా! వీళ్ల సంగతి తమకు తెలీదు. వీళ్ళకు రోజూ యిదే పని. ఎంత కాలమని యిలా ఊరుకోగలం? మా పని మేము చెయ్యాలిగదాండి."

"అలా చూడండి ఆ పిల వేపు! మీ రెంత హేయంగా తిట్టినా, మీ మనుషు లెంత అవమానించినా, అంత దీనంగా బతిమిలాడుతుంది. ఈలాంటి అపాయకరమయిన పనులన్నీ పొట్టకోసమేగా. కాస్త దయ చూపించండి" అన్నాడా పెద్దమనిషి. ఆ మాటల ధోరణిపట్టి చూస్తే, తను అనుకున్నంత పెద్దమనిషి కాదేమోనని ఆ అధికారికి అనుమానం తట్టింది.

"మీరు లక్ష చెప్పండి, వెయ్యి చెప్పండి! లాభం లేదు. వీళ్లి కేదో తిండి లేదనుకుంటారు మీరు. మన కన్న వాళ్ళే నయం. పట్టె దొంగవెధవలు. పూరిగుడిసెల్లో ఉంటూ, మాసిపోయిన బట్టలు కట్టి గంజి తాగి డబ్బు గడిస్తారు. ఎంతెంత డబ్బుంటుందో తెలుసా బాబూ వీళ్ళదగ్గర. ఊరికే వీళ్ళని దయతలచకూడదండి" అన్నాడు దరహాసవదనంతో.

"దానికేం లెండి గాని. అంత ఏడుస్తూంటే ఎలా సహించగలుగుతున్నారండి. నా మాట విని యీ రోజుకి వదిలివేయండి" అన్నాడా ముతకబట్టల మనిషి. ఆయన మాట ఎందుకు వినాలో అర్థమవలేదు ఆ అధికారికి.

"ఈ విషయంలో మాత్రం నన్ను క్షమించాలి" అన్నాడా ఉద్యోగి నిష్కర్షగా.

ఇంతలో బండి ఆగింది. అధికారి తాలూకు అనుచరులు ఆ బియ్యం మూటలు క్రిందికి లాగారు. నాగులునుకూడా, వాటితో పాటే ఓ బియ్యంమూటలాగే బరబర క్రిందికి లాగేశారు రెక్కపట్టుకుని. ఓ మూలనుండి వెంకమ్మ వచ్చి ఆ జవాన్లతో సంప్రతించింది. వెంకమ్మ తాలూకు ప్రయత్నాలన్నీ విఫలాలయ్యాయి. అంతలో అధికారిగూడా క్రిందికి దిగాడు. నాగులు అతని కాళ్ళకు చుట్టుకుపోయింది. అతడు కాళ్ళతో ఆమెను ఓపాతపీలికల మూట తోసినట్లు తోశాడు. బండి కదిలేకాలం వచ్చింది. బండిలోనుండి యీగొడవంతా ఓకంట కనిపెడుతున్న ఖద్దరు పెద్దమనిషి తన సంచీపట్టుకుని క్రిందికి దిగాడు. నాగులు తన్నుద్ధరించడానికి దివినుండి దిగివచ్చిన పరమేశ్వరుడనుకుంది.

ప్లాటుఫారంనుండి బండి శెలవుతీసుకుంది.

వెంకమ్మకూడా చుట్టుప్రక్కల తచ్చాడుతోంది.

దిగిన పెద్దమనిషి నేరుగా ఆ అధికారి దగ్గరకు వెళ్ళాడు. అతనితో యేదో మాట్లాడుతూ స్టేషను మాస్టరు గదివేపు తీసుకుని వెళ్ళాడు. ఈలోపుననే వెంకమ్మ రొంటిని దాచిన రూపాయలూడదీసి ఆజవానుల చేతుల్లో ఉంచింది. వాళ్ళుకూడా ఆడబ్బు పుచ్చుకుని "నువ్వెళ్ళు ముసలమ్మా. యీ స్టేషనులోనే ఉండు. మేం దీన్ని, యీ మూటల్ని కూడా తిరిగి పంపేతాం" అన్నారు కాస్తకంగారుగా. వెంకమ్మ తన దుర్విధిని నిందించుకుంటూ, నాగులుని ఊరడించి ఆ చిరుచీకట్లో మాయమయింది. ఆ బియ్యం మూటలన్నింటినీ ఆ అధికారి తాలూకు మనుషులు స్టేషను బయటకు చేర్చారు. నాగులుకూడా వాళ్ళ వెనకాలే వెళ్ళింది.

ఆ అధికారి ఆ పెద్దమనిషి కూడా బయటకు వచ్చేశారు.

అధికారి "ఒరేయి! యేం అలా చూస్తున్నారు. పోలీసు ఠాణాకు తీసుకు పదండి" అన్నాడు మేఘం ఉరిమినట్లు. అతని నోటినుండి మాత్రం వాన కురిసినట్లు ఉమ్మి తుంపరు రాలాయి.

"అయితే ఆ అమ్మాయిని పోలీసులకు అప్పజెప్ప డానికే తీసుకుపోతున్నారా?"

"ఆ, యిలాంటి చట్టవ్యతిరేకపు పనులెంతకాలం సాగుతాయి చెప్పండి."

"మనంమాత్రం చట్టవ్యతిరేకాలు చేయటంలేదూ? ఏదో కాస్త కనికరించండి పాపం."

"అదేంకుదరదు బాబూ. దీన్ని తీసుకుపోవల సిందే. ఏమయినా సరే."

"యీ వేళకు నాముఖం చూసన్నా వదలాలి. మీరుమాత్రం చట్టవ్యతిరేకం చెయ్యడంలేదూ. అంటే మరేం అనుకోకండి. మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అన్నాడు.

"మీ ముఖంచూసి యెందుకు వదలాలో నాకరం అవడంలేదు. నేను చేసే చట్టవ్యతిరేకపు పనులేమిటో అసలే తెలీడంలేదు" అన్నాడు విసుగ్గా అధికారి.

"మీ రామె నలా పదిమందిలో బూతులుతిడుతూ, అవమానిస్తూ, కాళ్లు పట్టుకుంటే కాళ్ళతో తొయ్యడం, రెక్కపట్టుకులాగడం, యివన్నీ చట్టాన్ని సమర్థించడానికే? యివేవీ చట్టానికి వ్యతిరేకాలు కావూ." అన్నాడా పెద్దమనిషి కించిత్తు కఠినంగానే.

"నీ కెందుకయ్యా యీ శ్రమంతా. నీదారిని నువ్వు పోవయ్యా దేవుడా! లేకపోతే నిన్నుకూడా ఆ పోలీసు స్టేషనులో పారేయవలసి ఉంటుంది ఆ పిల్లతోపాటు. తెలిసిందా వెళ్లు" అన్నాడు.

"ఆహా! మీ సంగతంతా నే చూస్తున్నాగా. ఆ ముసిలిదాని దగ్గర నీ బంట్రోతులు డబ్బు తీసుకోడం నే గమనించలేదనుకున్నావా?" అనేసరికి ఆ అధికారి ఆశ్చర్యపడ్డాడు. కాని బంట్రోతులను ఏమీ అనలేకపోయాడు.

ఎందుకో అందరికీ తెలుసును!

ఈ మౌనం ఆ ముతకబట్టలాయనకి ధైర్యం యిచ్చింది.

"నేనంత చెపుతున్నా నీకు తెలీడం లేదేం నేనెవర్నో? రేపీపాటికి నీ అవస్థ చూసుకుందూగాని. బీదవాళ్ళమీద నీ అధికారం, జులుం అన్నీ బాగా ప్రదర్శిస్తున్నావు." అని ఝాడించేసరికి ఆ అధికారి హడలిపోయాడు. ఆ మాటలతో భోగపడినటుంది. ఆ ముతకబట్టల్లో ఎంత శక్తి, అధికారం ఉందో! తన తెలివితక్కువ ప్రవర్తనకి తన్ను తాను తిట్టుకున్నాడు.

ఆ అధికారి బంట్రోతులతో ఆ మాటలూ, ఆ డబ్బూ ఆ పిల్లకు తిరిగి యిచ్చేయమని ఉరిమాడు. ఆ మాటలూ డబ్బూ తిరిగి యిచ్చేశారు. నాగులు మాట్లాడకుండా నిలుచుంది. అధికారీ అతని బంట్రోతులు ఆ ముతక ముసలివానికి నమస్కారాలుపెట్టి ముందుకు పోతున్నారు నిశ్శబ్దంగా.

3

ఆ ముసలివాడు నాగులు దగ్గరకు తిరిగివచ్చాడు. ఆమె కెదురుగా నిలబడ్డాడు. వాళ్ళ నెత్తిమీద వీధిలాంతరు వెలుతురు చిమ్ముతోంది.

"ఆ మాటలు, అవీ నెత్తి నెట్టుకుపో!" అని గదిమాడు. నాగులు కాస్త భయంగాను, కృతజ్ఞతతోను, అతనివైపు చూచింది. అతనియందేదో తెలీని గౌరవం కుదిరింది. ఆమె మాటలు నెత్తికెత్తుకుంది. ఒకడుగు ముందుకేస్తూ "తమరు నన్ను రక్షించారుబాబూ!" అంది మెల్లగా. "మంచి రక్షించడమే. యింతకన్న కూలిపని చేసుకోరాదూ. నానావెధవలచేతా చేతులూ కాళ్లూ పట్టించుకు నిలాగించుకోడం" అన్నాడు విసుగ్గా తనకూతురే అలాంటి అవస్థలు పడుతున్నట్టు. ఆమె కృతజ్ఞతతో నిండుకుంది.

"అయితే తమరు ఎవరుబాబూ" అంది.

"నేనా మీలాంటివాళ్ళు వ్యతిరేకించే చట్టాలు చేసేవాణ్ణి." అన్నాడు.

అతని సౌమ్య భావనాలకు ఆమె తేరుకుంది. తలమీద బరువుతో మెల్లగా అడుగులు వేస్తూ "చట్టాలంటే యేటిబాబూ" అంది మళ్ళీ.

"చట్టాలంటేనా, ప్రజలంతా సుఖంగా జీవించడాని కుపయోగపడే కట్టుబాట్లు. ఒక్కొక్క విషయంలో ఓ విధమయిన కట్టుబాట్లు. ఆకట్టుబాట్లు ఎవరూ ఉల్లంఘించ కూడదు. వ్యతిరేకిస్తే నిన్ను తీసుకుపోయినట్లు తీసుకుపోతారు వాళ్ళని కూడా." అన్నాడు తన అధికారానికి ఆనందిస్తూ.

"మరిగంటే బాబయ్యా—బీదోళ్ళని బాధపెట్ట కూడదని, అళ్ళకితిండి బట్ట యిల్లు అన్నీ ఉండాలని చట్టం చేయకూడదేవండి మీబోటు బాబుగారు" అంది యేదో తీరనితలపులు నెమరు వేస్తు.

"మాశావుగా యీరోజు నిన్ను బాధపెడితే ఊరుకున్నానా. అలాగే చట్టాలుచేసి తీరతాం"

అంటూ ఆమె బుజంమీద మెల్లిగా చేయి వేశాడు. నాగులు ఉలిక్కిపడి వెనుతిరిగిచూచింది. గుడ్డివెలుతురు. ముసలాయన మోములో చిరునవ్వు వెలుగుతోంది.

ఆమె హఠాత్తుగా తన నడక వేగాన్ని అధికం చేసింది. ముసలివాడి చేయి తెగిన సంకెలలా జారిపోయింది. ఆ వ్యక్తి కూడా కాస్త తొందరగా నడిచి ఆమె ప్రక్కకు చేరి "అంత పరిగెడుతున్నావేం" అన్నాడు.

"బండికి టైం అయింది బాబూ" అంది.

"నేనూ వస్తున్నాను" అంటూ మెల్లిగా మళ్ళీ చేయి జారవేశాడు ఆమె వంటిమీద.

నాగులుకా పెద్దమనిషి అవస్థ అంతా అర్థమయింది. మానవత్వాన్ని కత్తితో పొడిచినట్లయింది. అతన్ని చూసే అదివరకున్న గౌరవం పోయింది. కొంపదీసి యికముందు యిలాంటి చటాలేమన్నా చేస్తాడేమో అనుకుంది. విషాదమయమయిన ఆమె ముఖం లోంచి చిన్న మందహాసం వెలువడింది, దట్టంగా అల్లుకున్న వలమబ్బునుండి తొంగిచూచే మెరుపులాగ. పెద్దమనిషి మృదువైన ఆమెబుజం నెమ్మదిగా నొక్కాడు. ఆమె మళ్ళీ జాగ్రదవస్తలో ప్రవేశించింది. మెల్లిగా అతనిచేయి తన చేతితో తోసేసింది. వృద్ధునికి టక్కున కోపం వచ్చింది. అయినా అంతకోపం ప్రకటించడం మంచిది కాదనుకున్నాడు. "ఈగోజున నేను తోడుపడకపోతే నీపనేమయి ఉండేదో తెలుసా." అన్నాడు.

"సిత్తం బాబుగారు సానా ఉపకారం చేసినారు. మీ పేరు ఈ జనమలో మరచిపోను." అంది నాగులు.

"మీలాటివాళ్ళంతా మాటలతోటే పనులు చక్కబెట్టుకుంటారు." అన్నాడు తొందరగా నడిచి ఆమె పక్కకు జేరి.

"సత్తెంగా సెపుతున్నా బాబయ్యా! తమ ఉపకారం నే సెప్పుడూ మర్సిపోను."

"నువ్వు మర్చిపోకపోతే నాకు లాభంఏమిటి?" అన్నాడు.

నాగులేమీ మాట్లాడలేదు. గబగబ అడుగులు వేస్తూ వెడుతోంది. అతడు నెమ్మదిగా ఆమె నడుం మీదకు తనచేయి పోనిచ్చాడు ఆమె తుళిపడి విసురుగా అతని చేయి విసిరి వేసింది. తీసేసిన గోళ్ళెంలా వేలాడింది అతనిచేయి. జబ్బ ఎముక కాస్త నొప్పి పెట్టింది. తన ఆత్మగౌరవానికి దెబ్బ తగిలినట్లు బాధపడ్డాడు.

"యింతుపకారం చేస్తే యిదే నేమిటి? కొంచెమేనా బుద్ధి ఉండేగా? నీ గురించి యెంత ప్రతిమాలేను ఆ వెధవని." అన్నాడు కోపంగా.

ఆమె మాట్లాడకుండా వేగంగా నడుస్తోంది.

"లేకపోతే యీ పాటికి జైల్లో పారేసి, దావగొట్టి చెవులుమూసి, నీ వంటిమీద అందరూ తిలో చెయ్యివేస్తే బాగుంటుందేం నీకు?" అన్నాడు.

ఆమె నిశ్శబ్దంగా వేగంగా నడుస్తోంది.

"నీ నక్క వినయాలు, కల్లబొల్లి ఏడుపులు చూచి విడిచాడని అనుకున్నావేం పాపం."

ఆమె నోరు కదపలేదు. వేగంగా నడుస్తోంది.

"దయాగిరూను. యిలాంటి వాళ్ళమీద దయ కూడాను. ఇంత సహాయం చేసినా సరే......"

ఆమె మాట్లాడనేలేదు. రెట్టించిన వేగంతో నడుస్తోంది.

"మాట్లాడవేం బెలంకొట్టిన రాయిలాగ!" అంటూ ఆమెచేయి పట్టుకున్నాడు. ఆమె విదిలించుకుంది. అతడు యింకా గట్టిగా పట్టుకున్నాడు. ఆమె యింకా గట్టిగా విదిలించుకుంది. ఆ అదురుకు నెత్తిమీద మూటలు యిద్దరిమధ్యా పడ్డాయి. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటూంది. మాట్లాడలేకపోయింది. ఆమె అసహాయత ఆధారంగా తీసుకుని ఆమెను దగ్గరగా లాగుకుంటున్నాడు. ఆమె భయంతో వణకుతూంది.

వీధి దీపాలుకూడా బెదరినట్లు కదులుతున్నాయి.

కళ్ళు కోపంతో మెరుస్తున్నాయి. శరీరం బిర బిగుసుకుపోయింది.

"వన్నొదిలెయ్యండి" అని అరిచింది.

"ఇదిగో యీ పదిరూపాయిలు తీసుకో."

"నా దారిని నన్ను పోనియ్యండి" అంటూ తన చేయి లాగుకుంటోంది. అతడు ఆమెను నొక్కిపట్టుకుని తన వేపు లాగుకుంటున్నాడు. ఆమె తనశక్తి అంతా ఉపయోగించి ఒక్కలాగు లాగింది. అతడు ముందుకుపడాడు. ఆమె బరువుగా ఊపిరిపీలుస్తూ నిలుచుంది. అతడు లేవడానికి ప్రయత్నం చేస్తూ కళ్ళంట విస్ఫులింగాలు కురిపిస్తున్నాడు.

"యిదిగో బాబూ! మీ దారిని మీరు పోండి నన్నలరి పెట్టేరంటే గోల్లుపెట్టేసి పదిమందినీ కేకపెట్టేస్తాను." అందామె అతడు లేవకముందే.

"గోల్లు పెట్టేస్తావేం" నీ లాంటి దొంగలకు సహాయంచేయడం నాదే పొరపాటు" అన్నాడు బట్టలు దులుపుకుంటూ.

ఆమెమూటలు నెత్తికెక్కించుకుని, మాట్లాడకుండా, అతనివేపు చూడకుండా, గుడ్డిదీపాల వెలుతురులో స్టేషనువైపు వేగంగా నడుస్తూంది. అతడు నడుంవిరిగిన తాచుపాములా బుసలుకొడుతూ నడిరోడ్డుమీద నిల్చున్నాడు.

వీధిప్రక్క గుడ్డిదీపాల వెలుగులు చల్లగా నవ్వుకుంటున్నాయి.